సాక్షి
రాజన్న సిరిసిల్ల
మంగళవారం | 14 | ఫిబ్రవరి | 2023

న్యూస్‌రీల్

సీసీ రోడ్డు నిర్మించాలి


ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

ఇల్లంతకుంట(మానకొండూరు): మండలంలోని రహీంఖాన్‌పేట మోడల్‌స్కూల్ వరకు సీసీ రోడ్డు నిర్మించాలని కోరుతూ సోమవారం బీజేపీ నాయకులు రోడ్డుపై బైఠాయించారు. బీజేపీ మండలాధ్యక్షుడు బెంద్రం తిరుపతిరెడ్డి మాట్లాడుతూ గత పదేళ్లుగా మోడల్‌స్కూల్‌కు వెళ్లేందుకు సరైన రోడ్డు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్వామి, ప్రసన్న, హరీశ్, రంజిత్, రజనీకాంత్, ప్రవీణ్‌రెడ్డి, శ్రీకాంత్, సాయిప్రసాద్‌రెడ్డి, చుక్క రమేశ్, వేణు, అనిల్, శ్రీనివాస్, రాజేశ్, అజయ్ ఉన్నారు.

'పది' మోడల్ పరీక్షలు నిర్వహిస్తాం

సాక్షి ఎఫెక్ట్..

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలో పదో తరగతి విద్యార్థులు పబ్లిక్‌పరీక్షలను సమర్థంగా రాసేందుకు వీలుగా ముందస్తుగా మోడల్ పరీక్షలు నిర్వహిస్తామని జిల్లా విద్యాధికారి డి.రాధాకిషన్ తెలిపారు. 'పది పరీక్షలపై పట్టింపేది..?' అంటూ సాక్షిలో సోమవారం ప్రచురితమైన కథనానికి స్పందించి ఫోన్‌లో మాట్లాడారు. పదో తరగతిలో 11 పేపర్లకు బదులు ఆరు పేపర్ల నిర్వహణ మార్పునకు సంబంధించి అన్ని పాఠశాలలకు ఇప్పటికే సమాచారం అందించామన్నారు. విద్యార్థులకు మరింత అవగాహన కల్పించేందుకు వీలుగా ఒక్కో సబ్జెక్టుకు కనీసం 10 ప్రశ్నాపత్రాలు సిద్ధం చేసి పీడీఎఫ్ విధానంలో పాఠశాలలకు అందిస్తామని హామీ ఇచ్చారు.

జాతర ఏర్పాట్లు పరిశీలన

వేములవాడ: రాజన్న సన్నిధిలో ఈనెల 17 నుంచి జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు చేస్తున్న ఏర్పాట్లను ఏఎస్పీ చంద్రయ్య సోమవారం పరిశీలించారు. ట్రాఫిక్ కంట్రోల్ చేసేందుకు ఎక్కడెక్కడ బారికేడ్లు ఏర్పాటు చేయాలనేది సూచించారు. ఈఈ రాజేశ్, డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ వెంకటేశ్, ఏఈ శేఖర్ ఉన్నారు.

కాలువ పనుల పరిశీలన



బోయినపల్లి(వేములవాడ): బోయినపల్లి మండలం దేశాయిపల్లిలో అదనపు టీఎంసీ వరద కాలువ పనులను సిరిసిల్ల ఆర్డీవో శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. మిగిలిన భూముల పరిహారం వేగవంతం చేస్తామని తెలిపారు.

గంజాయి విక్రేతకు జైలు

సిరిసిల్లటౌన్: గంజాయి విక్రయించిన వ్యక్తికి సిరిసిల్ల ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జైలు శిక్షతోపాటు రూ.5వేలు జరిమానా విధించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సందీప్ తెలిపిన వివరాలు. ముస్తాబాద్ మండలం గూడెంలో గంజాయి విక్రయాలపై గతేడాది సెప్టెంబర్ 7న ఎస్సై వెంకటేశ్వర్లు, బృందం దాడులు చేశారు. దాడుల్లో చిట్నేని విక్రమ్‌కుమార్(28) అనే యువకుడిని పట్టుకుని 140 గ్రాముల గంజాయితోపాటు కేసు నమోదు చేయగా సిరిసిల్ల కోర్టులో రూరల్ సీఐ ఉపేందర్ చార్జిషీట్ దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సందీప్ కేసును వాదించగా.. మెజిస్ట్రేట్ సౌజన్య నిందితుడు విక్రమ్‌కుమార్‌కు ఏడాది జైలుతోపాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించారు.

కార్మిక భవన స్థలాన్ని కాపాడాలి



సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని కార్మిక భవన స్థలాన్ని కాపాడాలని భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు అక్కెనపల్లి భాస్కర్ కోరారు. జిల్లా కేంద్రంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. 1980లో కార్మికపెద్దలు సిరిసిల్ల నటరాజ్ థియేటర్ సమీపంలో 121 గజాల స్థలాన్ని కొని సుతారి సంఘం పేరిట రిజిస్ట్రేషన్ చేశారన్నారు. సదరు స్థలాన్ని కొందరు అక్రమార్కులు ఇప్పుడు అమ్ముకోవాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల కష్టంతో కొన్న స్థలాన్ని పరులపాలు చేయకుండా మంత్రి కేటీఆర్, కలెక్టర్ అనురాగ్ జయంతి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎస్.కె. మహబూబ్, కూరగాయల శ్రీనివాస్, దేవయ్య, చంద్రయ్య, హన్మవ్వ, భాగ్యవ్వ పాల్గొన్నారు.

ఒప్పించాం.. మెప్పించాం!



- తీరం చేరిన ప్రేమకథలు
- లవ్‌లో లైఫ్‌లో గెలిచిన ప్రేమ పక్షులు
- ఆదర్శనీయంగా నిలుస్తోన్న జంటలు
- నేడు వాలంటైన్స్ డే ప్రత్యేక కథనం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ప్రేమ.. కులమతాలకు అతీతమైన భావన. టీనేజీ వయసులో మొదలయ్యే ప్రేమకథలు ఆకర్షణతో మొదలై.. అక్కడితో ముగుస్తాయి. పరిణితితో కూడిన ప్రేమకథలు కచ్చితంగా విజయతీరాలు చేరతాయి. ఒక చేత్తో కెరీర్, మరో చేత్తో ప్రేమను సమతుల్యం చేసుకుంటూ ముందుకు సాగుతాయి. ఖండాలు దాటినా, ఏళ్లకు ఏళ్లు గడిచినా ఎదురుచూపుల్లోనే బతికేస్తారు. చివరికి తమ లక్ష్యాన్ని చేరుకుంటారు. ఆ తరువాత పెద్దల్ని ఒప్పిస్తారు. కొందరికి ఈ అవకాశం లేకపోవచ్చు. అయినా వీరు చేరుకున్న విజయతీరాలు, సమాజంలో వీరికి దొరికే స్థానం వీరిపై ఉన్న వ్యతిరేక భావనను క్రమంగా దూరం చేస్తుంది, అందరినీ దగ్గర చేస్తుంది. నేడు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా కులమతాలకు అతీతంగా ప్రేమ వివాహాలు చేసుకుని నలుగురికీ ఆదర్శంగా నిలిచిన ప్రేమజంటలపై కథనం.

మాది లవ్ కం అరేంజ్ మ్యారేజ్



సిరిసిల్లక్రైం: విద్యాభ్యాసం పూర్తి చేసి ఉద్యోగంలో సెటిల్ అయ్యాక మా స్నేహితులతో మా మధ్య ప్రేమ చిగురించింది. పెద్దలను ఎదిరించి పెళ్లి చేసుకోవాల్సిన అవసరం రాలేదు. అందరినీ ఒప్పించి సంప్రదాయ పద్ధతిలో పెళ్లి చేసుకున్నాం. నా భార్య దివ్యాన్షీ కంటి డాక్టర్. ఈతరం యువతకు నేను చెప్పేది ఒక్కటే.. కెరీర్‌పై దృష్టి పెట్టి లక్ష్యం సాధిస్తే అన్ని మన వద్దకు వచ్చి చేరుతాయి. ఆకర్షణకు గురైతే లైఫ్ ఆగమవుతుంది.– ఎస్పీ అఖిల్ మహాజన్–డాక్టర్ దివ్యాన్షీ దంపతులు

అనాథ యువతికి అన్నీ తానై..


శేఖర్, రమ్య దంపతులు

కథలాపూర్(వేములవాడ): అనాథ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకొని ఆదర్శంగా నిలిచాడు ఓ సామాజిక సేవకుడు. కథలాపూర్ మండలం తాండ్ర్యాల గ్రామానికి చెందిన కాసారపు శేఖర్ షైన్ హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటు చేశాడు. ఈ క్రమంలో తల్లిదండ్రులు లేని అదే గ్రామానికి చెందిన రమ్యను ప్రేమించాడు. 2013లో శేఖర్, రమ్య ప్రేమ వివాహం చేసుకున్నారు. తల్లిదండ్రులు లేని ఆమెకు అన్నీ తానయ్యాడు. వీరికి శ్రీహర్ష, రిషికేశ్ ఇద్దరు కుమారులు. శేఖర్ పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో 2018లో గవర్నర్ చేతులమీదుగా అవార్డు అందుకున్నాడు. కులాంతరమే కాదు.. అనాథ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్న శేఖర్‌ను పలువురు అభినందించారు.

నేనే ప్రపోజ్ చేశా..



ఏదో సందర్భంలో తన ఫ్రెండ్ ప్రశాంత్‌ను పరిచయం చేశారు. ఆ పరిచయమే కొన్నాళ్లకు ఇష్టంగా మారింది. ధైర్యం చేసి నేనే పెళ్లి ప్రేమను ప్రతిపాదించా. అమ్మానాన్న అంగీకరించలేదు. గొడవలు కూడా అయ్యాయి. సొంతంగా నిర్ణయం తీసుకుని అగ్రహారం ఆంజనేయ స్వామి సన్నిధిలో పెళ్లి చేసుకున్నాం. కొన్నాళ్ల తరువాత ఇరు కుటుంబాల వాళ్లు అంగీకరించి కలిసిపోయారు. ప్రస్తుతం అంతా సంతోషంగానే ఉంది. – లహరి, ప్రశాంత్

ఆకర్షణ సహజం.. అవగాహన కీలకం



యుక్త వయసులో వ్యతిరేక లైంగికాకర్షణ సహజమైన ప్రక్రియ. ఆ స్థితి దాటి ప్రయాణించాలంటే భవిష్యత్‌పై స్పష్టమైన అవగాహన ముఖ్యం. రాబోయే కాలంలో ఎదురయ్యే ఎత్తుపల్లాలని అధిగమించడానికి అవసరమైన శారీరక, మానసిక, విద్యార్హతలున్నాయా లేవా అని సరిచూసుకోవాలి. కేవలం భ్రమల్లో బతుకుతూ జీవితంలో నరకాన్ని చవిచూడడం భరించలేరు. అందుకే మనుగడ కోసం అవసరమైన అన్ని మార్గాలపై పట్టు సాధించాకే జీవితంలో అడుగుపెట్టే నిర్ణయం తీసుకోవాలి. – పున్నం చందర్, సైకాలజిస్టు

ప్రేమ ముందు ఓడిన వైకల్యం


రవికిరణ్, స్వాతి దంపతులు

పెద్దపల్లిరూరల్: 'నా స్వాతి బంగారం.. నేను మరుగుజ్జుగా పుట్టినా నాకు ఆ భగవంతుడు స్వాతి రూపంలో మంచి జీవితాన్నే ఇచ్చాడు' అని చెప్పుకొచ్చాడు రవికిరణ్. స్వాతి కుటుంబం ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలు నుంచి పెద్దపల్లికి వలస వచ్చింది. వారు రవికిరణ్ ఇంటి సమీపంలో అద్దెకు రావడంతో స్వాతితో ఏర్పడ్డ పరిచయం పరిణయానికి దారితీసింది. స్వాతి కుటుంబీకులు వ్యతిరేకించడంతో అప్పటి సీఐ హబీబ్‌ఖాన్‌ను ఆశ్రయించగా ఠాణాలోనే పెళ్లి జరిపించారని రవికిరణ్, స్వాతి పేర్కొన్నారు.

ఖండాలు దాటిన ప్రేమ



నేను ఎస్సారార్ కాలేజీలో డిగ్రీ చదువుతున్నక్రమంలో నాకు రమేశ్ పరిచయమయ్యాడు. రోజూ మా కాలేజీకి వచ్చేవాడు. ఒకరోజు నాకు ప్రపోజ్ చేశాడు. అయితే, జీవితంలో పైకి రావాలన్న నా కలను వివరించాను. అయినా తను వెనకడుగు వేయలేదు. నాకు పూర్తిగా సహకరించాడు. ఉన్నత విద్య కోసం నేను బ్రిటన్ వెళ్లాను. పీజీ పూర్తయి ఉద్యోగంలో చేరాక ఇండియా వచ్చాను. నా కోసం ఎదురుచూస్తున్న రమేశ్‌తో వివాహం జరిగింది. కులాలు వేరుకావడంతో మొదట్లో మా పెద్దలు వ్యతిరేకించినా.. కెరీర్‌లో నిలదొక్కుకున్న తీరుకు మా ప్రేమను అంగీకరించారు. ఇపుడు లండన్‌లో రెండు రెస్టారెంట్లు, ఒక కేక్‌షాప్ నడుపుతున్నాం. నలుగురికి ఉపాధి కల్పిస్తున్నం. ఏటా మా ఇద్దరి పిల్లలతో ఇండియాకు వస్తాం. – సుష్మ– రమేశ్

ప్రేమ కోసం దేశంలోనే..



మాది మంథని, మా వారిది కరీంనగర్. నేను అప్పుడు పీజీ చదువుతున్నా. మా ఆయన ప్రభాకర్ అప్పటికే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. ఓ పెళ్లి వేడుకలో అనుకోకుండా కలిశాం. పెద్దలను ఎదిరించి వివాహం చేసుకున్నాం. మాకు ఇపుడు ఒక పాప. మా ప్రేమను అర్థం చేసుకున్న పెద్దలు చివరికి మమ్మల్ని క్షమించేశారు. హైదరాబాద్‌లో ఓ ఇంటి వారిమయ్యాం. విదేశాలకు వెళ్లే అవకాశాలు వచ్చినా మా పేరెంట్స్‌ను చూసుకునేందుకు మా ప్రభాకర్ వాటిని సున్నితంగా తిరస్కరిస్తారు. ఏమాత్రం సెలవు దొరికినా మా పేరెంట్స్‌కే టైం కేటాయిస్తాం. – స్వప్న– ప్రభాకర్

అప్పట్లో చాలా కష్టపడ్డాం



నాది జగిత్యాల, ఆమెది కరీంనగర్. డిగ్రీ చదువుకునే రోజుల్లో మాకు ఎన్‌సీసీలో పరిచయం. పీజీకి వెళ్లాక కూడా కొనసాగింది. అపుడే ఎస్సై నోటిఫికేషన్ వచ్చింది. దాదాపు ఏడాది దూరంగా ఉండి ప్రిపేరయ్యా. ఈలోపు విషయం ఇంట్లో తెలిసిపోయింది. తన కుటుంబ సభ్యులు మొదట్లో వ్యతిరేకించారు. నేను ఎస్సైగా సెలెక్ట్ అయ్యాక మరో ఏడాది దూరంగా ఉన్నాం. పోస్టింగ్ తీసుకున్నాక వెళ్లి వారిని ఒప్పించా. – సుష్మ– రవిరాజ్



రాజన్న శరణు

వేములవాడ: మహాశివరాత్రి జాతర సమీపిస్తుండడంతో రాజన్నను దర్శించుకునేందుకు వస్తున్న భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. సోమవారం దాదాపు 25 వేల మంది భక్తులు రాజన్నను దర్శించుకున్నారు. ధర్మగుండం వద్ద భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. తలనీలాలు, నిలువెత్తు బెల్లం పంపిణీ మొక్కులు భారీగా చెల్లించుకున్నారు. రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ ఆయాచితుల శ్రీధర్ దంపతులు రాజన్నను దర్శించుకున్నారు.


కోడెమొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

జాతర ఉత్సవాల్లో లోటుపాట్లు ఉండొద్దు

- రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్

వేములవాడ: రాజన్న సన్నిధిలో మహాశివరాత్రి జాతర మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్ సూచించారు. మహాజాతర ఉత్సవాల ఏర్పాట్లను సోమవారం పరిశీలించారు. ధర్మగుండం, క్యూలైన్లు, తాత్కాలిక మరుగుదొడ్లు, వసతి గదులు, పార్కింగ్ స్థలం, ఆలయ ప్రాంగణం, తాగునీటి వసతి, లైటింగ్ ఏర్పాట్లను పరిశీలించి తగు సూచనలిచ్చారు. జాతర ఏర్పాట్ల పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈవో కృష్ణ ప్రసాద్, ఈఈ రాజేశ్, స్థపతి వల్లినాయగం, ఏఈవో ప్రతాప నవీన్, జయకుమారి, పర్యవేక్షకులు ఎడ్ల శివ, వరి నర్సయ్య పాల్గొన్నారు.

నేడు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' డిబేట్



సెటిలయ్యాకే..

- ప్రేమైనా..పెళ్లైనా • మారుతున్న యువతరం దృక్పథం
- నిర్దిష్టమైన అభిప్రాయాలతో ముందుకెళ్తున్న యువత

సిరిసిల్లకల్చరల్: ప్రేమ.. అనే రెండు అక్షరాలు రెండు హృదయాల స్పందన. వర్షించని మేఘం ఉంటుందేమో కానీ ప్రేమించని హృదయం ఉండదంటారు. అలాంటి ప్రేమ ఇటీవల పలు ప్రభావాలకు లోనై పెడర్థాలు తీస్తోంది. కొందరు ప్రేమికులు తొందరపాటు నిర్ణయాలతో కన్నవాళ్లకు గర్భశోకాన్ని మిగులుస్తున్నారు. ప్రేమించి పెళ్లితో బంధాన్ని శాశ్వతం చేసుకుని సంతోషంగా ఉన్న జంటలు కొన్నయితే.. కాలం గడిచిన కొద్దీ బలహీనతలను అంగీకరించలేని మనస్తత్వంతో పెడాకులు చేసుకుంటున జంటలు మరికొన్ని. ప్రేమించాల్సిందే అనే బెదిరింపులు, ఎమోషనల్ బ్లాక్ మెయిల్స్‌తో ప్రాణం మీదకు తెచ్చుకుంటున్న సంఘటనలు ఉన్నాయి. వాలంటైన్స్ డే సందర్భంగా ప్రేమ, పెళ్లి అంశాలపై కాలేజీ విద్యార్థులతో 'సాక్షి' మంఘలవారం నిర్వహించిన టాక్ షోలో వెల్లడైన అభిప్రాయాలు ప్రేమపై మారుతున్న యువతరం దృక్పథాన్ని ఆవిష్కరించాయి.

పెళ్లయ్యాక మొదలైన ప్రేమ నిలబడుతుంది



ఆకర్షణకు, ప్రేమకు తేడా తెలుసుకోలేని అపరిపక్వత యువత జీవితాలపై ప్రభావితం చేస్తోంది. ప్రేమపేరుతో మోసపోతున్న అమాయకత్వమే ఇందుకు నిదర్శనం. సరైన అర్హతలు చూసుకోకుండా ప్రేమనెపంతో పెళ్లిదాకా వెళ్లి జీవితాలను సమస్యల వలయంలో పడేసుకుంటున్నారు. ఇన్ని బాధలు పడే కన్నా పెళ్లయ్యాక కొనసాగించే ప్రేమే చిరకాలం నిలబడుతుంది. – వాసాల లహరి

అమ్మానాన్నల ప్రేమ పవిత్రమైంది



తల్లిదండ్రులు కురిపించే ప్రేమ ముందు ఏదైనా బలాదూరే. భవిష్యత్‌ను పణంగా పెట్టుకునే పసిప్రాయపు ప్రేమలతో స్వచ్ఛమైన ప్రేమ ఉనికి ప్రశ్నార్థకమవుతోంది. పెద్దలు కుదిర్చిన పెళ్లిలో ఏర్పడే సమస్యలను పెద్దవాళ్లే బాధ్యత తీసుకుని పరిష్కరించే అవకాశం ఉంటుంది. ప్రేమపెళ్లిలో ఇలాంటి సౌకర్యం ఉండదు. అయినవాళ్లకు దూరంగా ఉండాల్సి వస్తుంది. – కావ్య బలరాం

కెరీర్ తర్వాతే ఏదైనా..



ఆడపిల్లల మీద మొదటి నుంచి సొసైటీ ఫోకస్ ఎక్కువగా ఉంటుంది. కాపాడుకునే తాపత్రయంతో జరిగే ఆంక్షల కట్టడిని నిర్బంధంగా భావించొద్దు. పరిమితులకు మించి స్వేచ్ఛను కోరుకుని ప్రేమపేరుతో పారిపోతున్నారు. చాలా మంది ఇలా జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఎవరైన ముందు కెరీర్‌ను డిజైన్ చేసుకున్నాకే ప్రేమైనా.. ఇంకేదైనా ఆలోచించుకోవాలి. – పసుల ప్రియాంక

కన్నవాళ్లే శ్రేయోభిలాషులు



కని, పెంచి, విద్యాబుద్ధులు నేర్పించిన తల్లిదండ్రులు పంచే ప్రేమ ముందు మరేదీ సాటిరాదు. కోటి రూపాయల కట్నం తీసుకున్నోడు కూడా కోపం వచ్చిన రోజు చేయిచేసుకునే అవకాశం ఉంది. అదే అమ్మానాన్నలు ఆ పని చేయరు. వాళ్లు ఎప్పుడు మన శ్రేయోభిలాషులే. పెళ్లి తరువాత ప్రేమించడమే శ్రేయస్కరం. పెద్దలు కుదుర్చిన పెళ్లిలోనే భద్రత ఉంటుంది. – జిల్ల రమ్య

రెండూ అవసరమే..



ప్రేమ ఎప్పుడు అవసరం పెళ్లికి ముందా.. తరువాతా అనేది కష్టమైన ప్రశ్న. దాని అవసరం లేని సందర్భం ఉండదని నా అభిప్రాయం. సరైన అవగాహన, అర్థం చేసుకు నే విశాల దృక్పథం కరువైనప్పుడు ప్రేమ ఎప్పుడు ప్రదర్శించిన వృథానే. పెళ్లికి ముందు ప్రేమ కూడా పరస్పర అవగాహనకు దోహదం చేస్తుంది. తద్వారా లోపాలు, సామర్థ్యాలపై ఒక అంచనాకు వచ్చే వీలుంటుంది. – నిమ్మల సౌజన్య

పరిపక్వత ఉంటేనే..



యుక్తవయసులో కలిగే ప్రేమలో స్వచ్ఛత కన్నా స్వార్థమే ఎక్కువ. ఏదీ ఆశించకుండా నిస్వార్థంగా ప్రేమించడం అనేది అరుదు. అది దొరికిన వారు అదృష్టవంతులు. అటేడు తరాలు, ఇటేడు తరాలు ఆలోచించి చూసే సంబంధాలే నిలబడుతున్న విషయం కళ్లారా గమనిస్తున్నాం కదా. ఏ బంధమైన పరిపక్వత ఉంటేనే నిలబడతాయి. – గంగి సంధ్య

ప్రజావాణి అర్జీలు పరిష్కరించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- 19 దరఖాస్తుల స్వీకరణ


దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్లఅర్బన్: ప్రజావాణిలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ సమస్యలపై వచ్చిన 19 అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్‌లు సత్యప్రసాద్, ఖీమ్యా నాయక్, ఇన్‌చార్జి డీఆర్వో శ్రీనివాస్‌రావు ఉన్నారు.

పెన్షన్ ఇప్పించండి



నా భర్త నర్సయ్య 15 ఏళ్ల క్రితం నన్ను వదిలిపెట్టిండు. పెన్షన్ కోసం చాలా సార్లు దరఖాస్తు చేసుకున్నా.. కానీ పెన్షన్ రావడం లేదు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న. ఎలాంటి జీవనాధారం లేదు. దయచేసి అధికారులు స్పందించి పెన్షన్ ఇప్పించాలి. – మైసన్నగారి లక్ష్మి, గంభీరావుపేట

జిల్లా గ్రంథాలయం రాష్ట్రానికే తలమానికం

సిరిసిల్లకల్చరల్: సిరిసిల్లలోని సినారె స్మారక కేంద్ర గ్రంథాలయం రాష్ట్రానికే తలమానికంగా నిలుస్తోందని గ్రంథాలయ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఆయాచితం శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం గ్రంథాలయ భవనాన్ని సందర్శించిన సందర్భంగా మాట్లాడారు. మంత్రి కేటీఆర్ ప్రోత్సాహంతో అధునాతన గ్రంథాలయాన్ని నిర్మించిన తీరు ఆదర్శనీయమన్నారు. నిరుద్యోగుల సౌకర్యార్థం రోజుకు 12 గంటలకు పైగా పనిచేయడం స్ఫూర్తినిస్తోందన్నారు. మారుమూల ప్రాంతమైన గంభీరావుపేటలో అత్యాధునిక లైబ్రరీ నెలకొల్పడం ఆ ప్రాంత ప్రగతికి ప్రతీకగా ఉందన్నారు. ఎల్లారెడ్డిపేట, బోయినపల్లిల్లో పనులు జరుగుతున్నాయని వివరించారు. గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఆకునూరి శంకరయ్య, కార్యదర్శి బుగ్గారెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.


శ్రీధర్‌ను సత్కరిస్తున్న జిల్లా చైర్మన్ శంకరయ్య

క్లుప్తంగా

ముగ్గురిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసులు


వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గొల్లపల్లి ప్రధాన రహదారిపై సోమవారం ఎస్సై శేఖర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ముగ్గురిపై కేసులు నమోదు చేశారు. వాహన తనిఖీల్లో ఏఎస్సై కిషన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలకు అన్యాయం


వినతిపత్రం ఇస్తున్న రమేశ్

సిరిసిల్లఅర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లలో బీసీలకు అన్యాయం జరిగిందని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రాపెల్లి రమేశ్ పేర్కొన్నారు. కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టిన అనంతరం వినతిపత్రం అందించారు.

ఇద్దరు డ్రైవర్లపై కేసు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని పద్మనగర్ గ్రామశివారు పెట్రోల్ బంక్ ఎదుట ఆదివారం రాత్రి ప్రమాదం జరిగి బిట్ల మహేందర్ మృతి చెందిన ఘటనలో ఇద్దరు డ్రైవర్లపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.లక్ష్మారెడ్డి తెలిపారు. పెట్రోల్ బంక్ సీసీ పుటేజీ ఆధారంగా కారును గుర్తించామని, అజాగ్రత్తగా రాంగ్ రూట్లో కారు నడిపిన డ్రైవర్ వెల్ది అరవింద్‌తో పాటు లారీ డ్రైవర్ కనవేని రాంచందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని ఫాజుల్‌నగర్ వద్ద సోమవారం పోలీసులు పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఎస్సై నాగరాజు తెలిపిన వివరాలు. కరీంనగర్ నుంచి గంగాధర మీదుగా ఫాజుల్‌నగర్ వస్తుండగా ఈ బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. దాదాపు 25 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

శివంగాలపల్లి తొలి సర్పంచ్ మృతి


పెద్దరాములు (ఫైల్)

చందుర్తి(వేములవాడ): కోనరావుపేట మండలం శివంగాలపల్లి తొలి సర్పంచ్ కొలగాని పెద్ద రాములు(72) అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. శివంగాలపల్లి 1981లో గ్రామపంచాయతీగా ఏర్పాటైంది. అప్పుడు జరిగిన ఎన్నికల్లో కొలగాని పెద్దరాములు సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 1981 నుంచి 1986 వరకు సర్పంచ్‌గా కొనసాగారు. సోమవారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురికాక కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయారు. మృతుడికి భార్య లింగవ్వ, ఇద్దరు కుమారులు, కూతుళ్లు ఉన్నారు.

మహాజాతరకు ఆర్టీసీ బస్సులు..

- 850 ఆర్టీసీ బస్సులు..
- 14 మినీ బస్సులు..


వేములవాడ ఆర్టీసీ బస్టాండ్

వేములవాడఅర్బన్: రాజన్న ఆలయంలో ఈనెల 17నుంచి 19 వరకు అంగరంగ వైభవంగా నిర్వహి ంచే మహాశివరాత్రి వేడుకలకు వేములవాడ ఆర్టీసీ డిపో భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయనున్నారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చిన ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. తిప్పాపురంలో బస్టాండ్, రాజన్న గుడి కట్టకింద జగిత్యాల బస్టాండ్ ఏరియాలో తాత్కలిక బస్టాండ్ ఏర్పాటుచేయనున్నారు. రెండు బస్టాండ్‌లు ఏర్పా టుచేస్తుండడంతో ఏప్రాంత ప్రయాణికులైనా సు లువుగా బస్టాండ్‌కు చేరుకుని రాజన్న ఆలయానికి వెళ్లేవిధంగా అన్నిఏర్పాట్లు చేస్తున్నారు.

850 ఆర్టీసీ బస్సులు..

రాజన్న ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి జాతరకు భక్తులు పెద్దఎత్తున తరలివస్తుండడంతో ఆర్టీసీ అధికారులు వివిధ డిపోల నుంచి బస్సుల ను నడిపించనున్నారు. వేములవాడ బస్టాండ్‌కు కా మారెడ్డి డిపో, నిజామాబాద్, వరంగల్, నర్సంపే ట్, కరీంనగర్-1, కరీంనగర్-2, హైదరాబాద్ రూ ట్‌నుంచి వస్తాయి. అలాగే రాజన్న ఆలయం గుడి కట్టకింద తాత్కలిక బస్టాండ్‌కు ఆర్మూర్ డిపో, కోరుట్ల, నిర్మల్, మెట్‌పల్లి, వేములవాడ డిపోల నుంచి బస్సులు నడపనున్నారు.

14 ఉచిత మినీ బస్సులు..

వేములవాడ బస్టాండ్ తిప్పాపూర్ నుంచి రాజన్న ఆలయం వరకు భక్తులను చేరవేసేందుకు మూడు రోజులు 17, 18, 19 తేదీల్లో 24 గంటలు నిరంతరం భక్తులను చేరవేసేందుకు ఉచితంగా 14 మినీ బస్సులు ఏర్పాటు చేయనున్నారు. ఈ మినీ బస్సు లు 10 నిమిషాలకు ఒకటి ఉంటాయి.

ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ

ఆర్టీసీ బస్సులను,ప్రయాణికులను ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించనున్నారు. మూడు రోజులు సుమారు 200 మంది ఆర్టీసీ సిబ్బంది పాల్గొనున్నారు. ఆర్టీసీ బస్సులతో భక్తులకు ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం కల్గకుండా చూస్తుంటారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో 50 మంది సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయనున్నారు.

భక్తులకు అన్ని ఏర్పాట్లు..

- వేములవాడలోని తిప్పాపూర్ బస్టాండ్‌లో, గుడి కట్టకింద తాత్కలిక బస్టాండ్‌లో మెడికల్ క్యాంపు ఏర్పాటు
- భక్తులు, ప్రయాణికుల కోసం ప్రత్యేక సహాయ, సలహా కేంద్రం ఏర్పాటు
- వేములవాడ పట్టణంలోని అన్ని వైపులా భక్తులు, ప్రయాణికులకు సూచిక బోర్డులు ఏర్పాటు
- వేములవాడ బస్టాండ్‌లో మినరల్ వాటర్ ఏర్పాటు
- రాజన్న గుడి కట్టకింద బస్టాండ్‌లో తాత్కలిక మరుగుదొడ్లు, మంచినీటి వసతి ఏర్పాటు
- నాంపల్లి వద్ద కరీంనగర్ - వేములవాడ- సిరిసిల్ల రహదారి చౌరస్తా వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు.

మూడు రోజులు నడిచే బస్సుల వివరాలు

డిపోలు..	17న	18న	19న	మొత్తం
వేములవాడ	17	26	25	68
సిరిసిల్ల	17	17	17	51
కోరుట్ల	17	21	18	56
మెట్‌పల్లి	33	45	45	123
కరీంనగర్1	22	23	23	68
కరీంనగర్2	22	22	22	66
ఆర్మూర్	33	33	49	115
నర్సంపేట్	05	11	11	27
వరంగల్1	05	12	05	22
హన్మకొండ	10	11	11	32
నిజామాబాద్	16	16	11	43
నిర్మల్	33	44	33	110
కామారెడ్డి	22	25	22	69
మొత్తం	252	304	290	850

ఏర్పాట్లు చేస్తున్నాం



వేములవాడ రాజన్న ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి వేడుకలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. రెండు బస్టాండ్‌లు, భక్తులకు ఉచిత మినీబస్సులు, ప్రయాణికుల రద్దీనిబట్టి బస్సులను పెంచుతాం. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో వేములవాడకు చేరుకుని రాజన్నను దర్శించుకుని, సురక్షితంగా గమ్యాలకు చేరాలని కోరుతున్నాం.

– భీమ్‌రెడ్డి, కరీంనగర్ డిప్యూటీ ఆర్ఎం

ఆమరణ నిరాహార దీక్ష


ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న బీఎస్పీ నాయకులు

బోయినపల్లి(వేములవాడ): బీసీలకు 52 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని కోరుతూ సోమవారం బోయినపల్లిలో బీఎస్పీ నాయకులు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నల్లాల శ్రీనివాస్, జోనల్ మహిళా కన్వీనర్ స్వరూప ప్రారంభించారు. వారు మాట్లాడుతూ తెలంగాణలో బీసీలకు జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాలలో 52 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ తక్షణమే బీసీ జనగణన చేపట్టి ప్రతి పదేళ్లకోసారి కులాల వారీగా జనాభా లెక్కలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కొంకటి శేఖర్, తిరుపతి, అజయ్, అరుణ్‌కుమార్, రాజు, రవీందర్, మారుతి ఉన్నారు.

ఒకే కాన్పులో రెండు దూడలు


రెండు దూడలకు జన్మనిచ్చిన ఆవు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం అంకుషాపూర్‌లో ఆవు సోమవారం ఒకే కాన్పులో రెండు లేగ దూడలకు జన్మనిచ్చింది. గ్రామస్తుడు తుమ్మల కనకయ్య మూడేళ్ల క్రితం హెచ్ఎఫ్ జాతికి చెందిన ఆవును కొనుగోలు చేశాడు. ఆవు సోమవారం ఒకే కాన్పులో రెండు ఆడ లేగదూడలకు జన్మనివ్వడంతో రైతు సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.

వీపీవోలు ప్రజలతో మమేకమవ్వాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్
- వీర్నపల్లి ఠాణా సందర్శన


వీర్నపల్లి పోలీసుస్టేషన్ సందర్శనలో ఎస్పీ అఖిల్ మహాజన్

వీర్నపల్లి(సిరిసిల్ల): వీపీవో(విలేజ్ పోలీస్ ఆఫీసర్)లు ప్రజలతో మమేకమవ్వాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. సోమవారం వీర్నపల్లి ఠాణాను సందర్శించారు. రికార్డుల నిర్వహణ, 5ఎస్ అమలుతీరు, ఫంక్షనల్ వర్టికల్స్, పెట్రోలింగ్ టీమ్ పనితీరులను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలందించడమే పోలీసుల లక్ష్యమన్నారు. డయల్ 100 ఫిర్యాదులపై వెంటనే స్పందించాలన్నారు. ఠాణాకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని తెలిపారు. సిబ్బందికి సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సీఐ మొగిలి, ఎస్ఐ నవత ఉన్నారు.

లారీ ఢీకొని వృద్ధురాలి మృతి

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రాంపూర్ గ్రామంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతిచెందింది. గ్రామస్తులు, పోలీసుల వివరాలు.. రాంపూర్‌కు చెందిన మూదం చంద్రకళ(60) హుజూరాబాద్- జమ్మికుంట ప్రధాన రహదారిపై వెళ్తున్న క్రమంలో లారీ అతివేగంగా వచ్చి వెనుకనుంచి ఢీకొట్టడంతో వృద్ధురాలు అక్కడికక్కడే మృతిచెందింది. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తు పొలంలో పడి మహిళ..

ఇల్లందకుంట(హుజూరాబాద్): ప్రమాదవశాత్తు ఓ మహిళ పొలంలో పడి మృతిచెందిన ఘటన మండలంలోని మర్రివానిపల్లి గ్రామంలో జరిగింది. గ్రామస్తుల వివరాలు.. మర్రివానిపల్లికి చెందిన కనుకుల జయ(40) సోమవారం వ్యవసాయ పనుల నిమిత్తం తన చేనులో కలుపు తీయడానికి ఉదయం 7గంటలకు ఇంటి నుంచి వెళ్లింది. సాయంత్రం అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా వ్యవసాయ బావి వద్ద నిర్జీవంగా పడి ఉంది. జయ చిన్న కుమారుడు వినయ్ గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతురాలి భర్త కేశవ్‌రెడ్డికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో కుటుంబ బాధ్యతలు జయ చూసుకుంటుందని గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మోడల్‌స్కూల్‌ను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతా


సర్టిఫికెట్‌లు అందిస్తున్న రవీందర్‌రావు

వీర్నపల్లి(సిరిసిల్ల): మోడల్‌స్కూల్‌లో మౌలిక వసతులు కల్పించి కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతామని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పేర్కొన్నారు. వీర్నపల్లిలోని మోడల్‌స్కూల్‌ను సోమవారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యతో కలిసి సందర్శించారు. పాఠశాలలో సమస్యలను విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మంత్రి కేటీఆర్ సహకారంతో ఆధునిక భోజనశాల ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థులకు సరిపడ కంప్యూటర్‌లు, జిరాక్స్ ప్రింటర్‌ను అందిస్తామన్నారు. అనంతరం ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకంలో భాగంగా వృత్తివిద్య కోర్సులలో శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీపీ మాలోత్ భూల, సెస్ డైరెక్టర్ మాడ్గుల మల్లేశం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి, సర్పంచ్ పాటి దినకర్, ఎంపీటీసీ మల్లారపు అరుణ్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ కొండ రమేశ్‌గౌడ్, ప్రిన్సిపాల్ విశ్వనాథం, నాయకులు శ్రీరాంనాయక్, సంతోష్, భాస్కర్,చంద్రం, రామస్వామి, దేవరాజు ఉన్నారు.

సుపరిపాలనే లక్ష్యం

- బీజేపీ సిరిసిల్ల అసెంబ్లీ పాలక్ రాణిరుద్రమ


శక్తి కేంద్ర ఇన్‌చార్జిలతో మాట్లాడుతున్న రాణిరుద్రమ

ముస్తాబాద్(సిరిసిల్ల): తెలంగాణ ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యంగా బీజేపీ పనిచేస్తుందని ఆ పార్టీ సిరిసిల్ల అసెంబ్లీ పాలక్ రాణిరుద్రమ పేర్కొన్నారు. పోతుగల్‌లో శక్తి కేంద్ర ఇన్‌చార్జీలతో సోమవారం సమావేశమయ్యారు. రాణిరుద్రమ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమంలో, ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతోనే నేడు గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. గడపగడపకు కేంద్ర ప్రభుత్వ పథకాలను.. కమలం పువ్వు గుర్తును తీసుకెళ్లాలని కోరారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణ అభివృద్ధిలో పరుగులు పెడుతుందన్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో విద్య, వైద్యం అభివృద్ధి చెందాలన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు కస్తూరి కార్తీక్‌రెడ్డి, పార్లమెంట్ కో-కన్వీనర్ ఆడెపు రవీందర్, లగిశెట్టి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్, మల్లారెడ్డి, రాజు, కోల కృష్ణ, వరి వెంకటేశ్, తిరుపతి, మీస సంజీవ్, జనార్దన్, కిట్టు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వృద్ధుడు ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్‌కు చెందిన కల్వల రాజేశం (60) అప్పుల బాధతో సోమవారం తాటివనంలోని ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై రాజేశ్ తెలిపారు. గీత వృత్తిపై ఆధారపడిన రాజేశం.. ఇటీవల ఇంటి నిర్మాణం కోసం అప్పు చేశాడు. ఆ అప్పు తీర్చలేక మదనపడుతున్నాడు. ఈ క్రమంలో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.

అనారోగ్యంతో ఒకరు..

జ్యోతినగర్:అనారోగ్యంతో ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎన్టీపీసీ రామగుండంలో సోమవారం చోటుచేసుకుంది. రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ మల్కాపూర్‌కు చెందిన చొల్లేటి రవీందర్ (62) ఆటోడ్రైవర్. కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకున్నాడు. రవీందర్ భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీపీసీ ఏఎస్సై చక్రపాణి తెలిపారు.

వైభవంగా శోభయాత్ర

రుద్రంగి: మండలం మానాల గ్రామంలో సోమవారం శ్రీ భవాని శంబులింగేశ్వర శోభయాత్ర వైభవంగా జరిగింది. గ్రామంలోని వీధుల్లో శోభయాత్రలో శివ స్వాములు పాల్గొని శివనామ స్మరణతో నృత్యాలు చేశారు. మహిళలు మంగళ హారతులతో శోభయాత్రకు స్వాగతం పలుకుతూ శ్రీభవాని శంబులింగేశ్వరున్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

దాడి చేసిన వ్యక్తుల అరెస్టు

వేములవాడ: వేములవాడ పట్టణానికి చెందిన ఒన్నారం శ్యామ్ రాజన్న గుడికెళ్లి పూజలు ముగించుకుని ఇంటికి చేరుకుంటున్న సమయంలో గాంధీనగర్‌లో వాటర్ ట్యాంకు వద్ద కొంత మంది యువకులు కర్రలతో దాడి చేసి గాయపరచినట్లు టౌన్ సీఐ వెంకటేశ్ సోమవారం తెలిపారు. మంత్రాలు చేస్తున్నారనే నెపంతో దాడి చేసినట్లు పేర్కొన్నారు.

అన్నపై కత్తితో దాడి

- అడ్డుకున్న మరొకరికి గాయాలు


గాయపడ్డ సాగర్

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి రాజీవ్‌నగర్‌లో అన్నపై కత్తితో తమ్ముడు దాడిచేశాడు. స్థానికులు తెలిపిన వివరాలు. రాజీవ్‌నగర్‌కు చెందిన కాసారపు నారాయణకు ఇద్దరు కుమారులు సాగర్, చందు. సాగర్ ఆదేకాలనీలో వడ్రంగి షాపు నిర్వహిస్తూ వేరుగా జీవిస్తున్నాడు. చందు తల్లిదండ్రులతో ఉంటూ చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. ఈక్రమంలో తరచూ కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. సోమవారం అన్న సాగర్‌తో గొడవ పడి కత్తితో దాడిచేశాడు. సాగర్ చేతిపై గాయం కాగా.. అడ్డుకునేందుకు వచ్చిన బ్రహ్మచారికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. నిందితుడు పరారైనట్లు స్థానికులు తెలిపారు.

సిరిసిల్లలో నిరసనల హోరు

- విద్యుత్ సమస్యలపై కదంతొక్కిన కాంగ్రెస్
- కార్మిక సమస్యలపై వామపక్షాల ఆందోళన
- కలెక్టరేట్‌తో పాటు ప్రభుత్వ సంస్థల ఎదుట ధర్నాలు
- నాలుగు గంటల పాటు ఉద్రిక్తత

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రం సిరిసిల్ల సోమవారం నిరసనల కార్యక్రమాలతో హెరెత్తింది. కాంగ్రెస్, వామపక్షాలు, విద్యార్థి, కార్మిక, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన వరుస ఆందోళనలతో నాలుగు గంటల పాటు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కలెక్టరేట్, సెస్, ఎల్ఐసీ, ఆర్డీవో, తహసీల్దార్ తదితర కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించారు.

నిరంతరం కరెంటు అందించాలి


సెస్ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వ్యవసాయానికి 24 గంటల పాటు నాణ్యమైన ఉచిత కరెంటు అందించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సెస్ కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ మాట్లాడు తూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయరంగానికి ఉచిత కరెంటు అందిస్తామన్న హామీని వెంటనే నిలబెట్టుకోవాలని, అప్రకటిత కోతలు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని అన్నారు. అనంతరం రైతులు, ప్రజల విద్యుత్ సమస్యలపై సెస్ మేనేజింగ్ డైరెక్టర్ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణగౌడ్, జెడ్పీటీసీ నాగం కుమార్ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు వనిత, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీని ప్రైవేటీకరించొద్దు : సీపీఐ




సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు సోమవారం సిరిసిల్ల ఎల్ఐసీ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. లాభాల్లో నడుస్తున్న ప్రభుత్వ బీమా రంగ సంస్థ ఎల్ఐసీని ప్రైవేటీకరించొద్దని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. ప్రైవేటీకరిస్తే ప్రజా పోరాటాలు తప్పవని హెచ్చరించారు. నాయకులు పంతం రవి, కడారి రాములు, మంచికట్ల రమేశ్, మంద సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి


ఆర్డీవో ఆఫీసు ఎదుట సీపీఎం నిరాహార దీక్ష

పేదలకు ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కోరుతూ సోమవారం సిరిసిల్ల ఆర్డీవో ఆఫీసు ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులుగా గుర్తించిన నిరుపేదలందరికీ వెంటనే డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. లేకుండా నివేశన స్థలాలు ఇచ్చి ఇల్లు కట్టుకునేందుకు రూ.5లక్షలు ఇవ్వాలని అన్నారు. నాయకులు కోడం రమణ, సూరం పద్మ, గురజాల శ్రీధర్, ఎలిగేటి రాజశేఖర్, సామల కవిత, వేముల మానస, ఓడ్యాల వీరేశం, మామిడాల పద్మ, ఈర్ల రాజు, రాపెల్లి లత, గుడ్ల కౌసల్య, లావణ్యలు పాల్గొన్నారు. పలు పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు.

బీసీలకు రూ.50వేల కోట్లు కేటాయించాలి


తహసీల్దార్ ఆఫీసు ఎదుట ధర్నా చేస్తున్న బీసీ విద్యార్థి సంఘం నాయకులు

రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు ప్రభుత్వం రూ.50వేల కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ కంచర్ల రవిగౌడ్ మాట్లాడుతూ జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీలకు బడ్జెట్‌లో కేవలం రూ.2వేల కోట్లు కేటాయించిందని, ప్రభుత్వ చిన్నచూపుకు నిదర్శనమని అన్నారు. బీహార్ మాదిరిగా తెలంగాణాలో కూడా బీసీ గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. సంఘం డివిజన్ ఇన్‌చార్జి ఇల్లందుల ప్రకాష్, మట్ల నరేశ్, రుద్రవేణి సుజిత్‌కుమార్, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 51 సవరించాలి


కలెక్టరేట్ ఎదుట జీపీ కార్మికుల ధర్నా

జీపీ కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం వేములవాడ కమాన్ నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్రగా వచ్చి ధర్నా నిర్వహించారు. జీపీ కార్మికుల సంక్షేమానికి ఇబ్బందిగా ఉన్న జీవో 51ను సవరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి మల్లారెడ్డి డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. అనంతరం వివిధ సమస్యలను వివరిస్తూ కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. నాయకులు మల్యాల నర్సయ్య, బుర్ర శ్రీనివాస్, మల్లయ్య, రాజేశం, లక్ష్మణ్, రవీందర్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.